క్లుప్తంగా

సంతోషిమాతకు విశేష పూజలు



పూజలందుకుంటున్న సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో అష్టోత్తర శతనామాలతో పూజలు చేసి, ఉద్యాపనులు, మహానివేదన, మహా హారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవీ ఆశ్రమంలో అభిషేకాలు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న బాలభాస్కరశర్మ

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో పీఠాధిపతి బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. శ్రీచక్రాలవద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నిద్దాంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం : మండలంలోని నిద్దాం గ్రామంలో నిద్దాలమ్మ యాత్ర మహోత్సవం సందర్భంగా శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నారాయణ సేవతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ నియామక పత్రాలు అందజేత



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

రణస్థలం: నూతనంగా నియమితులైన అంగన్‌వాడీ సహాయకులకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శుక్రవారం రణస్థలంలోని క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కొండములగాం పంచాయతీ ముక్తుంపురం అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలుగా కలిశెట్టి సన్యాసమ్మ, లావేరు మండలం తామాడ-1 అంగన్‌వాడీ సహాయకురాలుగా తోటపల్లి హైమవతిలకు ఈ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ టొంపల సీతారాం, ఐసీడీఎస్ పీఓ ఝాన్సీ, నాయకులు మూగి శ్రీరాములు, అల్లు కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి.. పింఛన్ అందించి..



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్లు

లావేరు: కేశవరాయునిపాలెం పంచాయతీ హనుమయ్యపేటకు చెందిన వృద్ధురాలు నారాయణమ్మ అనారోగ్య సమస్యతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్లు యడ్ల లక్ష్మణరావు, కోల గోవిందలు శుక్రవారం విశాఖ వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

జూదరులపై నిఘా

జి.సిగడాం: జాతర సమయాల్లో పేకాట శిబిరాలు, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సామంతుల రామారావు హెచ్చరించారు. శుక్రవారం జగన్నాథవలస–జి.సిగడాం గ్రామాల మధ్య వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎక్కడైనా పేకాట జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

- అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించండి
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమావేశంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. రణస్థలం మండలం పైడిభీమవరంలో శుక్రవారం తెప్పలవలస, రావాడ, ఎర్రవరం, కృష్ణాపురం, అల్లివలస, కోటపాలెం, వల్లభరావుపేట, అర్జునవలస, నారువ, పైడిభీమవరం రెండు సచివాలయాల పరిధిలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల రూపంలో మూడున్నర ఏళ్లలో లక్షా తొంభై వేల కోట్ల రూపాయలను మహిళల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారని వివరించారు. ఒక్క రూపాయి కూడా అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులకే పథకాలను వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. అందరూ కలిసి పనిచేస్తే 2024లోనూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందన్నారు. కన్వీనర్లు, గృహసారథులు రోజుకు గంటపాటు జగనన్న ప్రభుత్వం అందిస్తున్న 'నా నమ్మకం నువ్వే జగన్' సామగ్రి ఇంటింటికి వెళ్లి ఇవ్వాలని సూచించారు. ప్రతిఒక్కరూ జగనన్న పాలనపై సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. గడపగడపకు– మన ప్రభుత్వం ద్వారా సుమారు 55 సచివాలయాల్లో పర్యటించానని, ఎక్కడా ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపించలేదని తెలిపారు. ఎచ్చెర్లలో జెండా పాతేద్దామని టీడీపీ, జనసేన నాయకులు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం కన్వీనర్లు, గృహసారథులకు 'నా నమ్మకం నువ్వే జగన్' కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల ఏఎంసీ చైర్మన్ లంకలపల్లి వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, రణస్థలం జెసీఎస్ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మహిళా మండలి అధ్యక్షురాలు గురాన మానస, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు,



జగనన్న పాలనకు మద్దతుగా నినాదాలు చేస్తున్న కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు

మైలపల్లి కామరాజు, గొర్లె అప్పలనర్సునాయుడు, రెడ్డి విశ్వేశ్వరరావు, మహంతి చినరామినాయుడు, లంకలపల్లి ప్రసాద్, గొర్లె తిరుపతినాయుడు, మురళీధర బాబా, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లో 'స్పందన' తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి దుర్గారావు

రణస్థలం: గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 5గంటల వరకు స్పందన నిర్వహించి వినతులు స్వీకరించాలని, ఈ సమయంలో సిబ్బంది కచ్చితంగా అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి బీహెచ్ దుర్గారావు అన్నారు. పైడిభీమవరం సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించాలని, లబ్ధిదారుల జాబితా సచివాలయం బయట ప్రదర్శనంగా ఉంచాలని సూచించారు. రోజుకు మూడు సార్లు హాజరు వేయాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

రణస్థలం: మండలంలోని జగనన్న కాలనీల 33 లే–అవుట్లలో ఉగాది నాటికి శతశాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఎంపీడీఓ వి.ధనుంజయరావు అన్నారు. రణస్థలం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంఈఓ ఎ.త్రినాథరావు మాట్లాడుతూ నాడు–నేడు రెండో దశ ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుప్పిలి మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిధిలోని సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ టాలెంట్ టెస్ట్–2023లో కుప్పిలి మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. 14 మంది విద్యార్థులు ప్రతిభ కనబరచడంతో ప్రశంసాపత్రాలు అందజేశారు. మండల కోఆర్డినేటర్ యాళ్ల సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కె.అప్పాజీ విద్యార్థులను అభినందించారు.

తిరుపతిపాలెంలో వైద్య శిబిరం



వైద్యసేవలందిస్తున్న దృశ్యం

రణస్థలం: మండలంలోని తిరుపతిపాలెంలో జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సర్పంచ్ ఆకుల రవి నేతృత్వంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఆస్పత్రి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఓటరుకార్డుతో ఆధార్ అనుసంధానం



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: ఓటరు కార్డుకు ఆధార్‌ను స్వచ్ఛందంగా అనుసంధానం చేయాలని శ్రీకాకుళం తహశీల్దార్ ఎస్.వెంకటరావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం బీఎల్ఓలు చేసిన ఆధార్ అనుసంధాన ప్రక్రియను ఎన్నికల డీటీ మురళీతో కలిసి పరిశీలించారు. శ్రీకాకుళం నగరంలో లక్షకు పైగా ఆధార్ అనుసంధానం లేని ఓటర్లను వారు గుర్తించారు. తక్షణమే బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. దీనిద్వారా బోగస్ ఓటర్లను నివారించవచ్చునని తహశీల్దార్ తెలిపారు.

సూర్యారావుకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న న్యాయవాది ఎన్ని సూర్యారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీనియర్ న్యాయవాది, శ్రీకాకుళం బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావుకి గౌరవ డాక్టరేట్ లభించింది. విశాఖ పబ్లిక్ లైబ్రరీలో గురువారం జరిగిన 11వ స్నాతకోత్సవంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ సభ్యులు, ప్రిన్సిపాల్ టి.శోభాశ్రీ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం శ్రీకాకుళం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆర్కయ హెల్త్ సెంటర్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ కెల్లి చిన్నబాబు పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సహాయ గవర్నర్ ఎంఆర్కే దాస్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అన్నెపు సత్యనారాయణ, రీజనల్ సెక్రెటరీ బి.శ్రీనివాస, ఉపాధ్యక్షులు డి.శివశంకర్, యార్లగడ్డ గీతా శ్రీకాంత్, కమ్యూనిటీ డైరెక్టర్ డాక్టర్ మంత్రి వెంకటస్వామి, ప్రతినిధులు అన్నెపు అనంతరావు, చాగంటి జగదీష్‌కుమార్, వై.శంకరరావు, ఆర్కయ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అందజేత



పరికరాన్ని అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గూనపాలెంకు చెందిన టి.లక్ష్మికి 10 లీటర్ల సామర్థ్యం గల ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో శుక్రవారం అందచేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధంకావాలి



పదో తరగతి విద్యార్థినులకు సూచనలు చేస్తున్న డీఈఓ గార పగడాలమ్మ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏప్రిల్ 3 నుంచి మొదలయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులు, తల్లిదండ్రులతో వేరువేరుగా సమావేశమయ్యారు. పరీక్షల సన్నద్ధతపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. ఉదయాన్ని త్వరగా నిద్రలేపి చదివించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇప్పటికే బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాలల్లో హెచ్‌ఎంలకు సూచించినట్టు చెప్పారు.

ట్యాబ్‌ల వినియోగంపై సంతృప్తి..

పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌ల వినియోగించే తీరు, విధానాన్ని పరిశీలించారు. బైజూస్ కంటెంట్ తమకు ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థినులు బదులిచ్చారు. పాఠశాలల్లో చెప్పినవి ఇంటి వద్ద ప్రాక్టీస్ అవుతున్నామని బాలికలు డీఈఓకు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.వాగ్దేవి, లక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన శ్రీనివాసరావు

నరసన్నపేట: మడపాం టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలికి చెందిన ఆటో డ్రైవర్ జి.శ్రీనివాసరావు గాయపడ్డారు. నరసన్నపేట నుంచి శ్రీకాకుళం వెళ్లే మార్గంలో ఆగిఉన్న లారీని ఆటో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. శ్రీనివాసరావు కాలుకి బలమైన గాయంకావడంతో ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐలు

శ్రీకాకుళం క్రైమ్ : ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు రక్షించుకోండి అంటూ శ్రీకాకుళం ట్రాఫిక్ పీఎస్ ఎస్‌ఐలు లక్ష్మణరావు, వెంకటేశ్వరరావులు వినూత్న తరహాలో ఫ్లెక్సీల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఎస్పీ జి.ఆర్.రాధిక, ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావుల ఆదేశాల మేరకు నగరంలోని ప్రధాన కూడళ్లు, ఎస్పీ కార్యాలయం వద్ద ఈ తరహా ఫ్లెక్సీలు శుక్రవారం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనచోదకులకు సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

లావేరులో సోషల్ ఆడిట్ ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

లావేరు: మండల కేంద్రం లావేరులోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో శుక్రవారం డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ మండల ప్రజావేదిక నిర్వహించారు. మండల వ్యాప్తంగా 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకూ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు, పింఛన్ల మంజూరు, ఉపాధి నిధులతో చేపట్టిన పంచాయతీరాజ్ పనులపై గత నెల 22 నుంచి ఈ నెల 2 వరకూ సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్సు పర్సన్ వెంకయ్య పర్యవేక్షణలో ఆడిట్ జరిగింది. డీఆర్పీలు, ఆడిట్ టీమ్ సభ్యులు పంచాయతీల వారీగా ఆడిట్ వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ లింగాల అప్పన్న, ఉపాధి ఏపీడీ శైలజ, క్లస్టర్ జేఈ నారాయణమూర్తి, లావేరు, రణస్థలం ఏపీఓలు ఆర్.సత్యవతి, ఎం.శ్రీనివాసనాయుడు, జేఈలు లెనిన్‌బాబు, గౌరీకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదరికం నిర్మూలన



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదరికం నిర్మూలన సాధ్యమవుతోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం జి.సిగడాం మండలం జాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. 220 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేయాలని పలువురు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా పేదలకు మేలు జరగాలన్న ఉద్దేశంతో అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా పథకాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలంతా అండగా నిలబడి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు పెద్ది శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు మీసాల సాధ్వీమణి, తోలేటి వెంకటరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటసాయి, జేసీఎస్ మండల కన్వీనర్ డోల వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్లు ఏర్నేన ప్రకాశరావు, పల్లేటి సన్యాసిరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బూరాడ వెంకటరమణ, పేడాడ శ్రీరామమూర్తి, చిక్కాల ధర్మారావు, కొర్రాయి అప్పారావు, ఇజ్జి కోటిబాబు, శ్రీనివాసరావు, మహేశ్వరరావు, బూటు అప్పారావు, సర్పంచులు బాణాన సూర్యనారాయణ, చందక సతీష్, భూపతి సురేష్‌కుమార్, తొత్తడి రామారావు, బాలి అప్పలసూరి, ఇన్‌చార్జి ఎంపీడీఓ బగాది రామ్మోహన్, ఏఈఈలు కూర్మనాథం, ఎం.రమేష్, కె.తిరుపతిరావు, భాగ్యలక్ష్మి, ఆర్‌ఐ రామచంద్రరావు, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి గౌరీ, పాట్నూరు సురేష్‌కుమార్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవరుచుకోవాలి



శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొన్న శ్రీనివాసానంద సరస్వతి

లావేరు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. మండలంలోని భరిణికాంలో ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూధర్మ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి గ్రామంలో రామాలయం నిర్మించుకోవాలన్నారు. గ్రామాల్లో అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అదపాక ఎంపీటీసీ గంట్యాడ సత్యం, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మీసాల అప్పారావు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు గొర్లె రామినాయుడు, శివాంగం నాగరాజు, పల్లి సూర్యనారాయణ, శటికం రాంబాబు, నాయకులు మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు, యందవ చిన్నికృష్ణ, లక్ష్మణ, రాము, మురళీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



తనిఖీలు చేస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ భవానీగిరీష్ ఎంటర్‌ప్రైజెస్ ఎరువులు, విత్తనాల, పురుగుల మందుల దుకాణాన్ని శుక్రవారం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం, ఎచ్చెర్ల వ్యవసాయాధికారి వై.సురేష్‌తో కూడిన బృందం తనిఖీలు చేపట్టింది. పురుగు మందులు అమ్మకపు స్టాక్ రిజిస్టర్ అప్‌డేట్ చేయకపోవడాన్ని గుర్తించారు. 21.08 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు నిలిపివేయాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకపోతే సీజ్ చేయటం, కేసుల నమోదు వంటి చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడికి తీవ్ర గాయాలు

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని 80 ఫీట్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. ఢీకొన్న కారు ఆగకుండా వెళ్లిపోయింది. ప్రస్తుతం ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. తల వెనుకభాగం గాయం కావడంతో అపస్మారక స్థితిలో ఉన్నారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం నుంచి కొందరు యువకులు బస్సు యాత్ర చేపట్టగా.. అది శుక్రవారం రాత్రి శ్రీకాకుళం చేరుకుంది. వారి రాత్రి బస తెలుగుదేశం కార్యాలయంలో చేస్తుండటంతో ఆ ఏర్పాట్లు చూసేందుకు వెళ్తున్న వెంకటేష్ ప్రమాదానికి గురయ్యారు. మాజీ ఎమ్మెల్యేలు గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవిలతో పాటు పలువురు టీడీపీ నాయకులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ ప్రశాంతనగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గుంపు అనంతరావు (64) ఒడిశాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం ఉదయం ఓ శుభకార్యానికి ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గుసాని సమితి (మండలం) కొర్సండ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తూ పర్లాకిమిడి పోలీసు స్టేషన్ పరిధిలోని పోడ్డుణి కూడలి వద్ద అనంతరావు కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. ఈ సమయంలో టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతన్ని పర్లాకిమిడి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.